లష్కర్‌లో ముగిసిన బోనాలు

భక్తులను సల్లంగా చూసుకుంటా ● ఈ సంవత్సరం వర్షాలు పుష్కలం ● ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు ● భవిష్యవాణి కార్యక్రమంలో స్వర్ణలత

బేగంపేట్, జూలై 22: అమ్మవారి నామస్మరణలు, భక్తులు పులకించే ఆటపాటలతో సికింద్రాబాద్‌లో బోనాల ఉత్సవాలు రెండో రోజు అత్యంత వైభవంగా జరిగాయి. మహంకాళి అమ్మవారికి సాక సమర్పణ భవిష్యవాణి, బలి, పోతరాజుల విన్యాసాలు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు, ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. అమ్మవారి ఊరేగింపు లంబాడి నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల వేషధారణలు,ఘటాల ఊరేగింపు భాజా భజంత్రీలు ,డప్పు చప్పుళ్ల హోరు, భక్తుల కేరింతలతో శోభాయమానంగా సాగింది. దీంతో లష్కర్ పుర వీధులన్నీ మార్మోగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహంకాళిని దర్శించుకున్నారు. భవిష్యవాణి సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారిలు పాల్గొని మహంకాళి అమ్మవారికి పూజలు చేశారు.

మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో ప్రశాంతంగా ముసిగిన బోనాల ఉత్సవాలు

మారేడ్‌పల్లి, జూలై 22: మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో బోనాల ఉత్సవాల్లో పోతరాజుల నృత్యాలు...రంగం..అమ్మవారి ఘటాల ఊరేగింపు...యువకుల కేరింతలు ....డప్పు చప్పుళ్లకు దీటుగా ఫలహార బండ్ల ఊరేగింపులు ఘనంగా కొనసాగాయి. బోనాల జాతర కార్యక్రమంలో భాగంగా రెండో రోజు (సోమవారం) పలు ఆలయాల వద్ద రంగం (భవిష్యవాణి) కార్యక్రమాలతో పాటు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పలు ఆలయాల వద్ద సందడి

రెజిమెంటల్‌బజార్‌లోని గండి మైసమ్మ ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారుల చేత జానపత, నృత్య, ఆట, పాటలతో సందడి చేశారు. దీంతో ఈ పరిసర ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. అదేవిధంగా స్థానికంగా ఉన్న జూలేశ్వరి అమ్మవారు, శ్రీ రేణుకా ఎల్లమ్మ, ముత్యాలమ్మ, ఏడు గుళ్ల అమ్మవారి ఆలయాల్లో రంగం కార్యక్రమాలు జరిగాయి. రెజిమెంట ల్‌బజార్‌లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కంటోన్మెంట్ ఐదవ వార్డు మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ గండి మైసమ్మ ఆలయంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి 7 గంటల నుంచి ప్రారంభమైన ఫలహారపు బండ్ల ఊరేగింపులో యువత పెద్ద ఎత్తున ఆట, పాటలతో సందడి చేశారు.

ఉజ్జయిని అమ్మవారి బోనాల సందర్భంగా రెండోరోజు అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో భారీగా వచ్చిన భక్తులు

రాంగోపాల్‌పేట్,మోండాలో వివిధ అమ్మవారి దేవాలయాల్లో రంగం వేడుకలు

రాంగోపాల్‌పేట్, మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో మహంకాళి అమ్మవారి జాతర కనుల పండుగగా సాగింది. ఆదివారం బోనాలు సమర్పించిన అనంతరం పలు ఆలయాల్లో సోమవారం భవిష్యవాణి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రీతి ప్రాయంగా తయారు చేసి ఫలహారాలు బండిలో పెట్టి ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు,శివసత్తుల పూనకాలతో జాతరను భక్తులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంతో పాటు సికింద్రాబాద్‌లోని పలు అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా శివాజీనగర్ డొక్కలమ్మ, రాష్ట్రపతి రోడ్డులోని దండు మారెమ్మ, సేయింట్ మేరీస్ రోడ్‌లోని పీనుగుల మల్లన్న, సెకండ్ బజార్‌లోని పోచమ్మ, ముత్యాలమ్మ, కళాసీగూడలోని శ్రీదేవి పోచమ్మ, స్టేషన్ రోడ్‌లోని రేణుకా ఎల్లమ్మ, తదితర దేవాలయాల్లో భవిష్యవాణి వినిపించారు. రంగం వేడుకల్లో భాగంగా ఈ ఏడు వర్షాల గురించి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు..భక్తులను సల్లంగా చూసుకునే బాధ్యత నాదే. అని భవిష్యవాణిలో అమ్మవారు వినిపించింది.


ఐదో వార్డు మహాత్మాగాంధీనగర్ బస్తీలోని శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ పూజలు చేశారు. అనంతరం శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

రెజిమెంటల్‌బజార్‌లో గండి మైసమ్మ ఆలయంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదితకు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

అమ్మవారి ఊరేగింపులో భాగంగా అంబారీకి పూజలు చేస్తున్న ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, దేవాలయం పండితులు

భవిష్యవాణి సందర్భంగా రెండో రోజు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

అంబారీపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

ఉజ్జయిని మహంకాళి దేవాలయ ఆవరణలో రంగం సందర్భంగా నృత్యాలు , భజన చేస్తున్న భక్తులు

పోలీసుల భారీ బందోబస్తు మధ్య అంబారీ ఊరేగింపు

భక్తులను ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలు

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్, ఓఎల్‌సీసీ, పీడీసీ తదితర కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 26లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, రెండో సంవత్సరం బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మరమ్మతులు చేపట్టండి

అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అమీర్‌పేట్, జూలై 22 : ఈ నెల 28న జరిగే బోనాలకు సంబంధించి అమీర్‌పేట్ డివిజన్ పరిధిలోని అమ్మవారి దేవాలయాల దగ్గర శిథిలమైన రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గుడిగె శ్రీనివాస్‌యాదవ్, గొలుసుల సత్యనారాయణలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం బీకేగూడలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగం అమీర్‌పేట్ ఏఈ జమీల్‌ను కలిసి పలు దేవాలయాల దగ్గర చేపట్టాల్సిన పనులకు సంబంధించి వివరాలను లిఖిత పూర్వకంగా అందజేశారు.

వంట పాత్రలు కీలకమే

అమీర్‌పేట్, జూలై 22 : ఆరోగ్యకరమైన వంటకాల తయారీలో వంట పాత్రలు కూడా కీలక భూమిక పోషిస్తాయని ప్రముఖ చెఫ్, బెర్గ్‌నర్ ఇండియా ప్రచారకర్త వికాస్ ఖన్నా పేర్కొన్నారు. భారతీయ ప్రాంతీయ వంటల విభిన్న అవసరాలను తీర్చేందుకు బెర్గ్‌నర్ సంస్థ ట్రై ప్లై, క్యాస్ట్ ఐరన్ వంటి విష పదార్థ రహిత కుక్‌వేర్‌ను సోమవారం సనత్‌నగర్‌లో ఆయన ఆవిష్కరించారు.
ఆరోగ్యకరమైన, మరింత సమర్థవంతమైన వంట పద్ధతులను ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్యానికి మేలు చేసే ట్రై ప్లై, క్యాస్ట్ ఐరన్ కుక్‌వేర్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు.

లాల్‌బజార్‌లో నేడు ఘటోత్సవం

బొల్లారం, జూలై 22: ఏడో వార్డు లాల్ బజార్‌లోని శ్రీ మహంకాళి దేవాలయంలో ఈనెల 24,25న జరుగనున్న ఆషాఢ మాస బోనాల జాతరకు మంగళవారం సాయం త్రం అంకురార్పణ జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిసారి దేవాలయంలో సీఈఓ సత్యచంద్రారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మహంకాళి మందిరం అధ్యక్షుడు మురళి ముదిరాజ్ అమ్మవారి ఆశీస్సులతో పతాకాన్ని ఆవిష్కరిస్తారని వర్కింగ్ ప్రెసిడెంట్ భక్తవత్సలం తెలిపారు.

ఘటం ఎదుర్కోల్లు..

తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్ నుంచి ఘటం (అమ్మవారు)ఎదుర్కోల్లు ఆనవాయితీగా వస్తుంది. ప్రతి ఏడాది మాదిరిగానే మంగళవారం సాయంత్రం మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్ నుంచి ఘటం(అమ్మవారు)నిమ్మలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎదుర్కోల్లు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.ఘటం ఊరేగింపుగా శాస్త్రీనగర్ నుంచి లాల్‌బజార్ చౌరస్తా మీదుగా శ్రీ మహంకాళి దేవాలయానికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

మహంకాళి అమ్మవారి దేవాలయానికి తీసుకెళ్తున్న ఘటం(ఫైల్ ఫొటో)

జేపీఎల్ ప్రారంభం

హైదరాబాద్, ఆట ప్రతినిధి : కేఎస్‌జే జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) సీజన్-1 పోటీలు సోమవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఆరాంఘర్‌లోని విజయానంద్ గ్రౌండ్స్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 10 టీవీపై టీవీ9 ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన 10టీవీ 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి గాను 116 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో టీవీ9 రెండు వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ సాయికిశోర్(69) 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో ఎన్‌టీవీ 58 పరుగులతో సాక్షి టీవీపై ఘన విజయం సాధించింది.

టాస్ వేస్తున్న త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి

జింఖానాలో డ్రెస్సింగ్‌రూమ్ ఆధునీకరణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సికింద్రాబాద్ జింఖానా క్రికెట్ స్టేడియంలో మహిళల డ్రెస్సింగ్‌రూమ్‌ను పూర్తిగా ఆధునీకరించారు. మహిళా క్రికెటర్ల సౌకర్యార్థం డ్రెస్సింగ్‌రూమ్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న ఎనిమిది చేంజింగ్ రూమ్స్‌కు మరమ్మతులు చేశారు. వీటిని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, హెచ్‌సీఏ సీనియర్ మెంబర్ ఆగమ్‌రావు, అకాడమీ డైరెక్టర్ విజయ్‌మోహన్ ప్రారంభించారు.

హామీల అమలులో..కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

హమాలీ బస్తీలో విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, జూలై 22 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతా రమేష్ అన్నారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలోని హమాలీ బస్తీ వాసులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని, బిల్లులు చెల్లించాలని, చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని విద్యుత్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బస్తీ ప్రజలు స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో సోమవారం ఆమె హమాలీబస్తీకి వెళ్లి బస్తీవాసులతో మాట్లాడారు. అనంతరం విద్యుత్ అధికారులను బస్తీకి పిలిపించి కార్పొరేటర్ ఉచిత విద్యుత్ అమలుపై నిలదీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.ఎనిమిది నెలలు కావస్తున్నా ప్రభు త్వం ఆరు గ్యారంటీల అమలుపై నోరుమెదపడం లేదని ఆమె ప్రశ్నించారు. రేషన్‌కార్డు ఉండి 200 యూనిట్లలోపు బిల్లులు వచ్చిన వారు సదరు బిల్లులను చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పినా ప్రభుత్వం ఇప్పుడు బిల్లులను చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తీసుకురావడం దురదుష్టకరమన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల ప్రక్షానా పోరాడుతామన్నారు.

దొంగల చేతివాటం

ఆరు తులాల బంగారు ఆభరణాలు, 20కి పైగా సెల్‌ఫోన్లు, ఎస్సై బైక్ చోరీ

బేగంపేట్, జూలై 22: భక్తులు అమ్మవారి దర్శనం, బోనాల సమర్పణలో భాగమై ఉండగా.. జేబు దొంగలు వారి చేతి వాటాన్ని ప్రదర్శించారు. భక్తుల రద్దీని లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచర్స్ రెచ్చిపోయారు. మహంకాళి ఆలయం పరిధిలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లలో జేబు దొంగలు,చైన్ స్నాచ ర్స్ భక్తుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు, బంగారు ఆభరణాలు, పలు బైక్‌లకు చోరీకి గురయ్యాయి. సోమవారం పోలీసులు తెలిపిన లెక్కల ప్రకారం 20కి పైగా సెల్‌ఫోన్‌లు, భక్తులకు చెందిన ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి.
బాధితులు సోమవారం మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో బోనాల విధులకు హాజరైన ఓ ఎస్సై బైక్ కూడా చోరీకి గురైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.